
నిధులు గలగల పారేనా?





- రాష్ట్ర బడ్జెట్‌పై ఉమ్మడి జిల్లావాసుల ఆశలు
- కాళేశ్వరం ప్రాజెక్టుకు కేటాయింపులపై సందిగ్ధం
- హెల్త్‌సిటీకి నిధులు అనుమానమే?
- మామునూరు ఎయిర్‌పోర్టుకు నిధులపై ఆశలు
- మేడారం జాతరకు వరాలు ప్రకటించే అవకాశం
- నేడు అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న డిప్యూటీ సీఎం

హనుమకొండ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో శనివారం ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌పై ఉమ్మడి జిల్లా ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఈ బడ్జెట్‌లో ఏ మేరకు నిధులు కేటాయిస్తోందోనని ఆశగా ఎదురుచూస్తున్నారు. జిల్లాలలోని పలు సమస్యల శాశ్వత పరిష్కారానికి, సమగ్రాభివృద్ధికి చేపట్టవలసిన పనులు, అర్ధాంతరంగా ఆగిపోయిన ప్రాజెక్టులు, పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనలకు కార్యరూపం ఇవ్వాలంటే ప్రభుత్వం బడ్జెట్‌లో చాలినన్ని నిధులను కేటాయించాల్సిన అవసరం ఉన్నది. ఈదృష్ట్యా బడ్జెట్‌లో కేటాయింపులు ఎలా ఉంటాయన్న చర్చ జరుగుతోంది.

కాళేశ్వరం నిధులు..?

భూపాలపల్లి జిల్లా పరిధిలోని కాళేశ్వరం ప్రాజెక్టు వివాదంలో చిక్కుకున్న నేపథ్యంలో ఈ ప్రాజెక్టుకు ఈసారి ప్రభుత్వం ఏ మేరకు నిధులు కేటాయిస్తుందన్న విషయంలో సందిగ్ధం నెలకొన్నది. గత బీఆర్‌ఎస్ సంవత్సరం ఈ ప్రాజెక్టు నిర్వహణకు పెద్దగా నిధులు కేటాయించలేదు. కాళేశ్వరం టూరిజం సర్క్యూట్ కోసం మాత్రం రూ.750 కోట్లను బడ్జెట్‌లో కేటాయించింది. కానీ ఒక్కపైసా కూడా విడుదల కాలేదు. కొత్త ప్రభుత్వం ఈ టూరిజం సర్క్యూట్ ప్రాజెక్టును కొనసాగిస్తుందా? నిధులు కేటాయిస్తుందా? అన్నదానిపై సందిగ్ధం నెలకొన్నది. అలాగే ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని దేవాదుల, శ్రీ రాంసాగర్ తదితర ప్రాజెక్టులకు ఏ మేరకు బడ్జెట్‌లో పద్దులుంటాయోనన్న చర్చ జరుగుతోంది.

మెగా టెక్స్‌టైల్ పార్క్


గీసుగొండ, శాయంపేట మండలాల పరిధిలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ పనులు కుంటినడక నడుస్తున్నాయి. మౌలిక సదుపాయాల కల్పనకు నిధుల కొరతను ఎదుర్కొంటోంది. ఈ బడ్జెట్‌లో ఏ మేరకు నిధుల కేటాయింపు జరుగుతుందో చూడాలి. గత బడ్జెట్‌లో ప్రాతిపదిక సదుపాయల కల్పనకు రూ.160కోట్లు మాత్రమే కేటాయించారు. ఈ బడ్జెట్‌లో ఎక్కువ నిధులు కేటాయింపు జరగవచ్చునని ప్రజలు ఆశిస్తున్నారు.

హెల్త్ సిటీ

వరంగల్ పాత సెంట్రల్ జైలు స్థలంలో హెల్త్ సిటీ ప్రాజెక్టులో భాగంగా కొత్తగా నిర్మిస్తున్న బహుళ అంతస్తుల సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రికి కూడా ఏమేరకు నిధుల కేటాయింపు జరుగుతుందో చూడాలి. గత ప్రభుత్వం రూ. 1100 కోట్ల వ్యయంతో నిర్మాణం చేపట్టిన విషయంలో కూడా వివాదం తలెత్తిం ది. ఈ ఆస్పత్రి స్థలాన్ని గత ప్రభుత్వం బ్యాంకులో కుదువబెట్టి రూ.2వేల కోట్లు తీసుకున్నదని, పైగా ఆస్పత్రి పనులు నాసిరకంగా జరుగుతున్నాయని ప్రభుత్వం విమర్శిస్తోంది. ఈ పరిస్థితుల్లో దీనికి బడ్జెట్‌లో ప్రభుత్వం ఏ మేర కు నిధులు ఇస్తుందోనని ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అలాగే మామునూరు ఎయిర్‌పోర్టును అభివృద్ధి చేయనున్నట్టు ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి

మిగతా 4వ పేజీలో..

పులకించిన పుట్టి పెరిగిన నేల





మన పీవీ.. ఇక భారతరత్నం..

- మరణానంతరం 20 ఏళ్లకు దక్కిన గౌరవం
- ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా హర్షాతిరేకాలు
- బహుభాషా కోవిదుడు, ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడు
- అంచెలంచెలుగా ప్రధాని స్థాయికి ఎదిగిన పీవీ

వరంగల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : లక్నేపల్లి గడ్డపై పుట్టి. వంగర నేలపై పెరిగిన మన పీవీ నర్సింహరావుకు భారతరత్న పురస్కారం లభించింది. ఈ మేరకు గురువారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ట్విట్టర్ ఎక్స్‌లో పీవీకి భారతరత్న పురస్కారంపై పోస్టు చేశారు. మారుమూల ప్రాంతంలో పుట్టిన పీవీ ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ దేశ అత్యున్నత పురస్కారమైన భారతరత్నను పొందటంతో ఓరుగల్లు ప్రజల్లో హర్షం వ్యక్తంఅవుతోంది. రాజనీతిజ్ఞుడు, బహుబాషా కోవిదుడు, సంస్కరణలకు ఆద్యుడుగా పిలిచే పీవీ నర్సింహరావు. తన జీవితంలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని భారతరత్నంగా నిలిచారు. ఎమ్మెల్యేగా అసెంబ్లీలో అడుగుపెట్టి.. ప్రధానిగా పార్లమెంట్‌లో నిలిచి తెలుగు తేజస్సును దశదిశలా చాటిన మహోన్నత వ్యక్తి.

లక్నేపల్లిలో పుట్టి... వంగరలో పెరిగి..

వరంగల్ జిల్లా నర్సంపేట మండలం లక్నేపల్లి గ్రామంలో 1921 జూన్ 28వ తేదీన రుక్మాబాయి, సీతారామారావు దంపతులకు పీవీ నర్సింహరావు జన్మించారు. ఇదే ప్రాంతంలో ప్రాథమిక విద్యను అభ్యసించారు. అయితే ఐదేళ్లకే అప్పటి కరీంనగర్ జిల్లా (ప్రస్తుత హనుమకొండ జిల్లా) భీమదేవరపల్లి మండలం వంగర గ్రామానికి చెందిన పాములపర్తి రంగారావు, రుక్మిణమ్మ దంపతులు పీవీని దత్తత తీసుకున్నారు. అప్పటి నుంచి పాములపర్తి వెంకట నర్సిం హరావుగా మారారు. హుజూరాబాద్‌లో పాఠశాల, హనుమకొండలో కళాశాల విద్యను పూర్తి చేశారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఎల్ఎల్‌బీ చదువు తుండగానే నిజాం సర్కారుకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమంలో కాంగ్రెస్ నేతలతో పాల్గొన్నారు. 1938లో హైదరాబాద్ రాష్ట్ర కాంగ్రెస్‌లో చేరారు. అప్పటి నిజాం ప్రభుత్వం నిషేధించిన వందేమాతరం గేయాన్ని పాడటంతో యూనివర్సిటీ నుంచి పీవీని బహిష్కరించారు. ఆ తరువాత నాగపూర్‌లోని ఓ మిత్రుడి సహాయంతో 1940 నుంచి 1944 వరకు ఎల్ఎల్‌బీ చదివారు. హైదరాబాద్‌కు తిరిగి వచ్చిన పీవీ.. కాకతీయ పత్రికను స్థాపించి జయ అనే మా రుపేరుతో వ్యాసాలు రాస్తూ నిజాంపై పోరాటాన్ని కొనసాగించారు. స్వామి రామానంద తీర్థ, బూర్గుల కృష్ణారావుల అనుచరుడిగా స్వాతంత్ర్యోద్యమంలో పీవీ పాల్గొన్నారు. 1951లో ఏఐసీసీ సభ్యుడిగా పీవీ పదవి లభించింది. కాగా, పీవీ నర్సింహరావు సతీమణి సత్యమ్మరావు 1970 జూలై 1న మృతి చెందారు. వీరికి ముగ్గురు కుమారులు, ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. వీరిలో మాజీ మంత్రి పీవీ రంగారావు పెద్ద కుమారుడు కాగా, సికింద్రాబాద్ మాజీ ఎంపీ పీవీ రాజేశ్వర్‌రావు, పీవీ ప్రభాకర్‌రావులు ఉన్నారు. పీవీ కుమార్తెల్లో ఒకరైన వాణిదేవి పట్టభద్రుల ఎమ్మెల్సీగా విజయం సాధిం చారు.

రాజకీయ ప్రస్థానం

కరీంనగర్ జిల్లా మంథని నియోజకవర్గంలో 1957 నుంచి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 1962లో రెండోసారి విజయం సాధించిన తరువాత మంత్రిగా అవకాశంవచ్చింది. 1962 నుంచి 1971 వరకు వివిధ మంత్రిత్వ శాఖలను నిర్వహించారు. 1971లో సెప్టెంబరు 30న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. రెండేళ్లు ఆ పదవిలో కొనసాగిన పీవీ.. అనూహ్య రీతిలో సీఎం పదవిని కోల్పోయారు. ఆ తరువాత రాష్ట్ర రాజకీయాలకు గుడ్‌బై చెప్పి జాతీయ రాజకీయాల్లోకి అడుగు పెట్టారు. రాష్ట్ర రాజకీయాలకు కరీంనగర్ అండగా నిలబడితే జాతీయ రాజకీయాల్లో మాత్రం వరంగల్ జిల్లా నిలపెట్టింది. తొలిసారి 1977లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో హనుమకొండ ఎంపీ స్థానం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. తరువాత వచ్చిన మధ్యంతర ఎన్నికల్లో 1980లో మరోసారి పోటీచే సిన పీవీ రెండోసారి కూడా విజయం సాధించారు. 1980-84 మధ్యకాలంలో విదేశీ వ్యవహారాల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఆ తరువాత 1984లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో హనుమకొండ నుంచి మూడోసారి పోటీ చేసిన పీవీ.. బీజేపీ అభ్యర్థి చందుపట్ల జంగారెడ్డి చేతిలో ఓడిపోయారు. అయితే 1984లోనే మరోస్థానం మహ రాష్ట్రలోని రామ్‌టెక్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి కూడా పోటీ చేసి విజయం సాధించారు. 1984 నవంబరు నుంచి 1985 ఫిబ్రవరి వరకు భారత ప్రణాళిక శాఖ మంత్రిగా, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా పని చేశారు. 1985-1989 మధ్యకాలంలో కేంద్ర రక్షణ మంత్రిగా, కేంద్ర మానవవనరుల అభివృద్ధి శాఖ మంత్రిగా, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రిగా, విదేశీ వ్యవహారాలశాఖ మంత్రిగా పీవీ పనిచేశారు. 1989లో నాలుగోసారి రామ్‌టెక్ నుంచి ఎంపీగా ఎన్నికయ్యారు. 1991లో అప్పటి ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ హత్యకు గురైన తరువాత పీవీ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 1991-96 మధ్య కాలంలో ఏఐసీసీ అధ్యక్షుడిగా పనిచేశారు. అదే సమయంలో ప్రధానమంత్రిగా కూడా పీవీ నర్సింహరావు బాధ్యతలు చేపట్టారు. 1991 జూన్ నుంచి 1996 మే 10వ తేదీ వరకు కొనసాగారు. ఐదేళ్ల పాటు మైనారిటీ ప్రభుత్వాన్ని విజయవంతంగా నడిపిన ఘనత పీవీదే.

> "రాజనీతిజ్ఞుడు, బహుభాషా కోవిదుడు పీవీ నర్సింహరావు ఈ దేశానికి అందించిన సేవలు అపారం..' ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, కేంద్రమంత్రిగా, పార్లమెంట్ సభ్యుడిగా అయన చేసిన సేవలు చిరస్మరణీయం. దేశాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేయడంలో ఆయన నాయకత్వం బలమైన పునాది వేసింది. పీవీ హయాంలో ప్రపంచ మార్కెట్‌ను భారత్ ఆకర్షించింది. ఆయన పాలనలో ఆర్థిక వృద్ధికి కొత్త శకం మొదలైంది. విదేశాంగ విధానం, విద్యారంగంలో ఆయన అందించిన సహకారం దేశాన్ని సాంస్కృతంగా, మేధోపరంగా దేశాన్ని సుసంపన్నం చేసింది."
>
> - ట్విటర్ ఎక్స్‌లో ప్రధాని మోదీ



వంగర, లక్నేపల్లిలో సంబరాలు 5

జిల్లాలో 9 మంది సీఐల బదిలీలు

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 9 : జిల్లా వ్యాప్తంగా 9 మంది సీఐలను బదిలీ చేస్తూ మల్టిజోన్ ఐజీ తరుణ్‌జోష్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మహబూబాబాద్ హెడ్ క్వార్టర్స్‌లో డీఎస్‌బీగా విధులు నిర్వహిస్తున్న సీఐ బాలాజీ వరప్రసాద్‌ను మహబూబాబాద్ టౌన్ సీఐగా బదిలీ చేశారు. సీసీఎస్‌లో సీఐగా విధులు నిర్వహిస్తున్న ఈ.చంద్రమౌళిని గూడూరు సీఐగా, గూడూరు సీఐగా విధులు నిర్వహిస్తున్న కె.ఫణిదర్‌ను తొర్రూరు సీఐగా, తొర్రూరు సీఐగా విధులు నిర్వహిస్తున్న వై.సత్యనారాయణను డీఎస్‌బీ మహబూబాబాద్‌కు బదిలీ చేశారు. రామగుండంలో సీఎస్‌బీ-1 కమిషనరేట్‌లో విధులు నిర్వహిస్తున్న ఎన్.మంగీలాల్‌ను మహబూబాబాద్ రూరల్ సీఐగా బదిలీ చేశారు. మహబూబాబాద్ రూరల్ సీఐగా విధులు నిర్వహిస్తున్న బానోత్ రమేష్‌ను డీసీఆర్బీ మహబూబాబాద్‌కు బదిలీ చేశారు. డీసీఆర్బీలో విధులు నిర్వహిస్తున్న సీహెచ్.శ్రీనివాస్‌ను మల్టిజోన్‌లో రిపోర్టు చేయాలని ఆదేశించారు. వరంగల్ కమిషనరేట్‌లో వెయిటింగ్‌లో ఉన్న పెండ్యాల దేవేందర్‌ను మరిపెడ సీఐగా బదిలీ చేశారు. మరిపెడ సీఐగా విధులు నిర్వహిస్తున్న ఎల్.రాజును మల్టిజోన్‌లో రిపోర్టు చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు.

12 మంది ఎస్సైలు ట్రాన్స్‌ఫర్

మహబూబాబాద్ రూరల్ 9 : జిల్లాల్లోని వివిధ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న 12 మంది ఎస్సైలను బదిలీ చేస్తూ.. శుక్రవారం రాత్రి మల్టీజోన్ ఐజీ తరుణ్‌జోష్ ఉత్తర్వులు జారీ చేశారు. గూడూరు ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న రాణాప్రతాప్‌ను మానుకోట టౌన్ ఎస్సై బదిలీ చేశారు. కొత్తగూడ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న నగేష్‌ను గూడూరు ఎస్సైగా రానున్నారు. గంగారం ఎస్సై దిలీప్‌ను కొత్తగూడ ఎస్సైగా బదిలీ చేశారు. మహబూబాబాద్ పోలీస్ హెడ్‌క్వార్టర్ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న జి.రవికుమార్‌ను నర్సింహులపేట ఎస్సైగా, మహబూబాబాద్ డీఎస్‌బీ ఎస్సైగా జి.కరుణాకర్‌ను దంతాలపల్లి ఎస్సైగా, డోర్నకల్ ఎస్సై ఝాన్సీని పెద్దవంగర ఎస్సైగా బదిలీ చేశారు. మహబూబాబాద్ ఎస్సై దీపికను మహబూబాబాద్ రూరల్ ఎస్సైగా, మహబూబాబాద్ టౌన్ ఎస్సై విజయ్‌రాంను సీరోల్ ఎస్సైగా, మరిపెడ ఎస్సై జీనస్‌ను గార్ల ఎస్సైగా, మహబూబాబాద్ డీఎస్‌బీగా పనిచేస్తున్న సహేర్‌బాబా ను మరిపెడ ఎస్సైగా, మహబూబాబాద్ డీఎస్‌బీలో పని చేస్తున్న వంశీధర్‌ను కేసముద్రం ఎస్సైగా, మహబూబాబాద్ సీసీఎస్‌లో పని చేస్తున్న బి.మహేష్‌ను గంగారం ఎస్సైగా బదిలీ చేశారు. దంతాలపల్లి ఎస్సై రమేష్‌బాబు, నర్సింహులపేట ఎస్సై జి.సతీష్, డోర్నకల్ ఎస్సై ఝాన్సీలకు ఎక్కడ పోస్టింగ్ ఇవ్వలేదు.

వెరిఫికేషన్‌కు వచ్చే సిబ్బందికి సహకరించాలి

- మరిపెడ మునిసిపల్ కమిషనర్ రాజు

మరిపెడ, ఫిబ్రవరి 9 : ప్రజాపాలన దరఖాస్తుల వెరిఫికేషన్‌కు వచ్చే మునిసిపల్ సిబ్బందికి పట్టణ ప్రజలు సహకరించాలని కమిషనర్ రాజు అన్నారు. శుక్రవారం మునిసిపాలిటీ సిబ్బంది, మెప్మా రిసోర్స్ పర్సన్స్ ఇంటింటికి తిరిగి ప్రజాపాలన దరఖాస్తుల వెరిఫికేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కమిషనర్ పలు వార్డుల్లోని వెరిఫికేషన్ నిర్వహణను పరిశీలించారు. ప్రజలతో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మహాలక్ష్మీ పథకంలో భాగంగా గ్యాస్ కనక్షన్ల కలిగిన లబ్ధిదారులకు రూ.500 సబ్సిడీ ఇవ్వనున్నదన్నారు. ఆ పథకం వర్తింపు కోసం మీవద్ద ఉన్నగ్యాస్ కంపెనీ బుక్‌లను తనిఖీ బృందాలు పరిశీలించి తప్పొప్పులను సరి చేస్తారన్నారు. ప్రతీ ఇంటికి సర్వేటీంలను పంపడం జరుగుతుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వార్డు ఆఫీసర్స్ యాకయ్య, రాములు, ఏకలవ్య, మెప్మా రిసోర్స్‌పర్సన్స్ ఉమ, శమీమ్ ఉన్నారు.



దరఖాస్తుల వెరిఫికేషన్‌ను పరిశీలిస్తున్న రాజు

మహిళల కృషితోనే కాంగ్రెస్‌కు అధికారం

- పార్టీ గెలుపు కోసం కష్టపడిన వారికి ప్రాధాన్యం
- నామినేటెడ్ పదవుల్లో స్థానం కల్పిస్తాం
- కేసీఆర్‌కు హెలీక్యాప్టర్‌ను కొనేంత డబ్బు ఎక్కడిది?
- మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 9 : మహిళల కృషితోనే తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు అన్నారు. 51 శాతం ఉన్న మహిళా ఓటర్లు కాంగ్రెస్‌కు పార్టీకి మద్దతుగా నిలిచి, అధికారం కట్టబెట్టారని వెల్లడించారు. మానుకోటలోని డీసీసీ కార్యాలయంలో మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని శుక్రవారం స్థానిక జిల్లా అధ్యక్షురాలు నూనావత్ రాధ అధ్యక్షతన నిర్వహించారు.



సమావేశంలో మాట్లాడుతున్న సునీతారావు

ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో మహిళలకు సముచిత స్థానం దక్కుతుందన్నారు. కాంగ్రెస్ పటిష్టతకు, ఎన్నికల్లో విజయం కోసం పని చేసిన మహిళా కాంగ్రెస్ నేతలకు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఆరు గ్యారెంటీలతో అత్యధికంగా మహిళలకే మేలు జరగనుందన్నారు.

బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీలకు బుద్ధి చెప్పాలి..

పేదలను విస్మరించిన బీఆర్‌ఎస్, బీజేపీలకు త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని సునీతారావు పిలుపునిచ్చారు. మహిళలకు రక్షణ కల్పించడంలో మోదీ ప్రభుత్వం విఫలమైందన్నారు. పేదలను మర్చిన ప్రధాని కార్పొరేట్ శక్తులకు మేలు చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ఖజానాను ఖాళీచేసి, అప్పులు చేసి పోయిన బీఆర్‌ఎస్‌ను ఓడించి కారును షెడ్డుకు పంపించాలన్నారు. గ్రామ, బూత్‌స్థాయిలో కమిటీలు వేసి మహిళా కాంగ్రెస్ పటిష్టపర్చాలని విజ్ఞప్తి చేశారు. ఐటీ కట్టలేని మాజీ సీఎం కేసీఆర్‌కు సొంత హెలికాప్టర్ కొనుగోలు చేసేంత డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిదన్నారు. బీఆర్‌ఎస్, బీజేపీ, ఎంఐఎం పార్టీలు ఒక్కటేనన్నారు. కేసీఆర్ కూతురు ఎమ్మెల్సీ కవిత ఎన్నికల్లో ఎక్కడ నిలబడ్డా డిపాజిట్ రాకుండా ఓడించాలని పిలుపునిచ్చారు. పార్లమెంట్ ఎన్నికల్లో మహిళలకు అధిక సీట్లు కేటాయించేలా ఏఐసీసీ విజ్ఞప్తి చేశానని తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ 12 సీట్లు గెలవడం ఖాయమైపోయిందని, 15 సీట్లు గెలిచేలా పార్టీ శ్రేణులు కష్టపడాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర కో-ఆర్డినేటర్ నీలం పద్మ, రాష్ట్ర నేతలు దేవీ ప్రసన్న, పార్వతమ్మ, ఆదిత్య, విజయలక్ష్మి, స్వర్ణలత, కాంగ్రెస్ అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య, ఎస్టీ సెల్‌మాజీ అధ్యక్షుడు బానోత్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నైతిక విలువలతో కూడిన విద్యనందించాలి

- జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు

పెద్దవంగర, ఫిబ్రవరి 9 : విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్యనందించాలనిఉపాధ్యాయులను డీఈవో రామారావు సూచించారు. శుక్రవారం చిట్యాలలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు నమోదు రికార్డులను, పాఠశాల నిర్వహణ తీరును పరిశీలించి,పాఠాలు విన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి వార్షిక పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులను సంసిద్ధులను చేయాలన్నారు. విద్యార్థులు కష్టపడి చదవి ఉత్తమ ఫలితాలను సాధించాలన్నారు. విద్యార్థులు ముఖ్యంగా విద్యాభాస్యంతో పాటు జీవిత విలువను తెలుసుకోవాలని, వాటికి అనుణంగా సమాజంలో నడవడికతో ముందుకు సాగాలన్నారు. వార్షిక పరీక్షలకు 40 రోజులు మాత్రమే ఉందని, వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేకశ్రద్ధ వహించాలన్నారు. పాఠశాలలో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక ప్రణాళికలను రూపొందించాలని ఉపాధ్యాయులను కోరారు. టెన్త్ విద్యార్థుల ప్రత్యేక తరగతుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. నోడల్ హెచ్‌ఎంలు మహంకాళి బుచ్చయ్య, పాఠశాల హెచ్‌ఎం విజయ్‌కుమార్, సీఆర్పీలు రంగన్న, సంతోష్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కురవిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్టడీ అవర్స్‌లో విద్యార్థులు

భయం వదులుకో.. విజయం అందుకో

- వార్షిక ఎగ్జామ్స్‌పై టెన్షన్ వద్దు
- విద్యార్థులకు పేరెంట్సే ధైర్యం
- ఆత్మస్థైర్యాన్ని నింపుతున్న గురువులు, నిపుణులు
- ప్రత్యేక తరగతులతో సంసిద్ధులను చేస్తున్న ఉపాధ్యాయులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 9 : పరీక్షల సీజన్ ఈనెల నుంచి ప్రారంభం కానుంది. వార్షిక ఎగ్జామ్స్‌కు సమయం దగ్గర పడుతోండటంతో విద్యార్థులు దృష్టి సారించారు. మంచి మార్కులను సాధించేందుకు.. ఉపాధ్యాయులు, అధ్యాపకులు వాళ్లను సంసిద్ధులను చేస్తున్నారు. ఎక్కువగా స్కోరు చేసేందుకు ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో ప్రత్యేక తరగతులను ప్రారంభించారు. వివిధ సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థుల మీద ఉపాధ్యాయులు దృష్టిని సారించారు. అల్పాహారం అందిస్తూ.. ప్రత్యేక తరగతులు నిర్వ హిస్తున్నారు. వివిధ సబ్జెక్టులతో ఉన్న డౌట్‌లను నివృత్తి చేస్తున్నారు. ఎగ్జామ్స్‌పై విద్యార్థుల్లో ఉన్న బెంగను పోగొట్టడానికి, ఆందోళనలను దూరం చేయడంతో పాటు ఆత్మస్థైర్యాన్ని నింపడానికి టీచర్లు, లెక్చరర్లు చొరవ తీకుంటున్నారు. నిపుణులతో విద్యార్థులకు బోధన చేయిస్తున్నారు.

ఈనెల 15వ తేదీన సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్‌ఈ) టెన్త్ పరీక్షలు ప్రారంభమై, మార్చి 13తో ముగుస్తాయి. 12వ తరగతి (10+2) పరీక్షలు ఈనెల 15న ప్రారంభమై ఏప్రిల్ 2వ తేదీ వరకు కొనసాగనున్నాయి. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించి ఈ నెల 28వ తేదీ నుంచి ఇంటర్ థియరీ, మార్చి 18 నుంచి ఎస్సెస్సీ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ 8వ తేదీ నుంచి 18 వరకు.. 1వ తరగతి నుంచి 9వ క్లాస్ విద్యార్థులకు వార్షిక పరీక్షలు జరుగనున్నాయి.

ఎగ్జామ్స్ అంటే భయాన్ని వీడితే, జయం మనదేననీ.. మనోనిబ్బరాన్ని పెంచుకోవాలి. ఎక్కువ మార్కులు సాధించాలని రాత్రింబవళ్లుచదవాలన్న ఆతృతతో నిద్రకు దూరం కావడం, అతి సమయం మేల్కొని ఉండటం, సరియైన ప్రణాళిక, తగిన ఆహారనియమాలు పాటించకుండా పోతే అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. చదివి అవగాహన చేసుకోవాల్సిన అంశాలను స్పష్టంగా రాస్తే మంచిఫలితాలు తప్పకుండా వస్తాయి.

ఇక.. సోషల్ మీడియాకు దూరం

సహజంగా నిద్ర ఎవ్వరికైనా మెడిసిన్ లాంటిది. నిర్ణీత కాలంలో నిద్రపోవడంతో మనస్సుకు ప్రశాంతత లభిస్తోంది. అరచేతిలో ప్రపంచాన్ని చూపుతున్న విజ్ఞానం మరోకోణంలో నిద్రకు దూరం చేస్తుంది. అదే సోషల్ మీడియా ఈ రోజుల్లో విద్యార్థులను అన్నింటికి దూరం చేస్తోంది. మీడియాకు అడెక్ట్ కావడం ద్వారా ఫేస్‌బుక్, వాట్సాప్, మెయిల్ చెకింగ్ వంటి వాటికి అలువాటు పడుతున్నారు. దీంతో తెలియకుండా నిద్రకుభంగం కలుగుతోంది. ఎక్కువ సమయం కంప్యూటర్, సెల్‌కు అత్తుకుపోవడం వల్ల ఇతరాంశాలపై దృష్టిసారించలేకపోతున్నారు. పరీక్ష సమయానికి ముందునుంచే సోషల్‌మీడియాకు దూరంగా ఉండటం మంచిదని సైకాలోజిస్టులు సూచిస్తున్నారు.

ఒత్తిడిని అధిగమించండిలా..

పరీక్షలఒత్తిడి లక్షణాలు ఒక్కొక్కరికి ఒక్కొక్క రకంగా ఉంటాయి. తలనొప్పి, ఆహారం జీర్ణంకాకపోవడం, వాంతి అయ్యేలా అన్పించడం, ఎక్కువగా తినేయడం, నిద్రలేమి, అలసట, అసహనం, నిరాశ, ఆత్మవిశ్వాసం లేకపోవడం, తరచుగా మూడు మారిపోతుండడం ఇవన్నీ పరీక్షల్లో ఒత్తిడిని సూచించే లక్షణాలని సైకాలజిస్టులు చెబుతున్నారు. నిజానికి పరీక్షలు సమర్థవంతంగా రాసే శక్తిఉన్నా పరీక్షల ముందు చదివింది గుర్తుకు ఉండడం లేదన్న భయం

మిగతా 6వ పేజీలో..

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలకు పక్కా ప్రణాళిక

- కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

మహబూబాబాద్, ఫిబ్రవరి9 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతిలో ఉత్తమ ఫలితాలను సాధించేందుకు అధికారులు పక్కా ప్రణాళికలను రూపొందించాలని జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో ఎస్సెస్సీ పరీక్షా ఫలితాలపై జిల్లా విద్యా, సంక్షేమశాఖ అధికారులతో శుక్రవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో 204 పాఠశాలల నుంచి 4,224 మంది బాలురు, 3,967 బాలికలు వార్షిక పరీక్షలకు హాజరవుతున్నట్లు విద్యాశాఖ అధికారులు కలెక్టరుకు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో సాధించిన ఫలితాలను దృష్టిలో పెట్టుకుని ప్రస్తుత సంవత్సరంలో టెన్త్ పరీక్ష ఫలితాలు మెరుగయ్యే విధంగా పక్కాప్రణాళికతో ముందుకు పోవాలన్నారు. అందుకు కావాల్సిన ప్రణాళికను రూపొందించుకోవాలని సూచించారు. పరీక్షల పట్ల విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి ఆత్మస్థైర్యంతో అత్యుత్తమ ఫలితాలు సాధించే విధంగా ప్రోత్సాహించాలన్నారు. పరీక్షలకు సన్నద్ధమవుతున్న సమయంలో విద్యార్థులకు అల్పాహారం ఏర్పాటు చేయాలన్నారు. అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో, జిల్లా అధికారులు రమాదేవి, సన్యాసయ్య, రామారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అద్వైత్‌కుమార్ సింగ్

నిధులు గలగల పారేనా?

(3వ పేజీ తరువాయి)

ప్రకటించారు. ఈ నేపథ్యంలో బడ్జెట్‌లో ఎయిర్‌పోర్టుకు నిధుల కేటాయింపు జరగవచ్చునని భావిస్తున్నారు.

నగరాభివృద్ధి

వరంగల్ నగరాభివృద్ధికి బడ్జెట్‌లో చాలినన్ని నిధులు కేటాయించాల్సిన అవసరం ఉన్నది. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు, ఔటర్ రింగ్ రోడ్డు పనుల పూర్తికి నిధులేమైనా బడ్జెట్‌లో కేటాయింపు జరుగుతుందా? నిధుల లేమి వల్ల కాళోజీ కళాక్షేత్రం పనులు పదేళ్లుగా నత్తనడకన సాగుతున్నాయి. రూ. 50 కోట్లతో చేపట్టిన ఈ ప్రాజెక్టుకు గత ప్రభుత్వం నిధులు ఇవ్వలేదు. అంచనా వ్యయంతో రూ.100కోట్లకు పెరిగింది. కళాక్షేత్రాన్ని పూర్తి చేయడానికి బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులు కేటాయించాల్సిన అవసరం ఉంది.

మెగా లెదర్ పార్క్

జనగామ జిల్లా పరిధిలోని మెగా లెదర్ పార్క్ ఏర్పాటు చేస్తామని 2016లో అసెంబ్లీ సాక్షిగా కేటీఆర్ ప్రకటించారు. కానీ ఇప్పటి వరకు సాకారం కాలేదు. ఈ పార్క్ ఏర్పాటుపై కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ దృష్ట్యా ఈ బడ్జెట్‌లో నిధుల కేటాయింపు జరగవచ్చునని జనగామ జిల్లా వాసులు ఆశపడుతున్నారు. కొడకండ్లలో మినీ టెక్స్‌టైల్ పార్క్ దేవరుప్పుల, నష్కల్‌లో ఫుడ్ ప్రాజెసింగ్ జోన్ల ఏర్పాటు విషయమై బడ్జెట్‌పై ఆశలు పెట్టుకున్నారు.

బయ్యారం ఉక్కు

గత బడ్జెట్‌లో మహబూబాబాద్ జిల్లాకు కేసీఆర్ ప్రభుత్వం మొండి చేయిచూపింది. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటుపై ప్రభుత్వం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వివాదం సాగుతోంది. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇటీవలే ఢిల్లీలో ఈ విషయమై సంబంధిత కేంద్ర మంత్రులతో చర్చించింది. ఈ ప్రాజెక్టు ఏర్పాటు ప్రాథమిక పనులకు శ్రీకారం చుట్టాలని ప్రభుత్వం యోచిస్తున్నట్టు తెలుస్తోంది. ఇందులో భాగంగా శనివారం నాటి బడ్జెట్‌లో నిధుల ప్రస్తావన ఉండొచ్చని ఆశిస్తున్నారు. మల్యాలలో కృషి విజ్ఞాన కేంద్రం జెన్నారెడ్డి వెంకట్‌రెడ్డి స్మారక ఉద్యానవన ఫల పరిశోధన కేంద్రానికి అనుబంధంగా వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల కోసం నిధుల ప్రకటనను జిల్లా ప్రజలు ఆశిస్తున్నారు.

మేడారం జాతర

సీఎం రేవంత్ రెడ్డికి మేడారం సమ్మక్క సారలమ్మ జాతరతో సెంటిమెంట్ ఉంది. కిందటేడు పాదయాత్రను ఇక్కడి నుంచే మొదలు పెట్టారు. ముఖ్యమంత్రిగా పదవిని అధిష్టించారు. ఈ క్రమంలో ఈ సారి జాతరకు రానున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మేడారం జాతరలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధుల ప్రకటన ఏమైనా ఉంటుందా? అని ములుగు జిల్లా వాసులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. జాతరను జాతీయ పండుగ హోదాను కల్పించడంపై కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చే విషయమై బడ్జెట్‌లో ప్రస్తావన ఉంటుందా? అని చర్చించుకుంటున్నారు.

మౌలానా ఆజాద్ వర్సిటీలో పార్ట్ టైమ్ పీహెచ్‌డీ

దిక్సూచి DIKSUCHI



హైదరాబాద్‌లోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ(మనూ) - పార్ట్ టైం పీహెచ్‌డీ ప్రోగ్రామ్ 2023-24 వింటర్ సెషన్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. స్పాన్సర్డ్, సెల్ఫ్ ఫైనాన్సింగ్ విధానాలు అందుబాటులో ఉన్నాయి. ఇంజనీర్‌లు, సైంటిస్టులు, సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు, మేనేజీరియల్ స్టాఫ్, స్టార్టప్ ప్రమోటర్స్, అకడమిక్ అడ్మినిస్ట్రేటర్లు, టీచర్లు దరఖాస్తు చేసుకోవచ్చు. రీసెర్చ్ అడ్మిషన్ టెస్ట్(ఆర్ఏటీ), డాక్యుమెంట్స్ వెరిఫికేషన్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. గరిష్ఠంగా ఆరేళ్లలో పూర్తిచేయవచ్చు. స్కాలర్‌షిప్ సౌకర్యం లేదు.

విభాగాలు-సీట్లు: మేనేజ్‌మెంట్ విభాగాల్లో 9, కామర్స్ విభాగాల్లో 6, సైన్సెస్ విభాగాల్లో 21, టెక్నాలజీ విభాగాల్లో 4, ఎడ్యుకేషన్ అండ్ ట్రెయినింగ్ విభాగాల్లో 38, దక్కన్ స్టడీస్ విభాగాల్లో 5, సోషల్ సైన్సెస్ విభాగాల్లో 15, మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం విభాగాల్లో 7 సీట్లు ఉన్నాయి.

అర్హత: పదోతరగతి/ఇంటర్/డిగ్రీ స్థాయిలో ఉర్దు ఒక సబ్జెక్ట్‌గాగానీ లేదా ఉర్దూ మీడియంలోగానీ చదివి ఉండాలి. లేదా మదర్సా కోర్సు పూర్తిచేసి ఉండాలి. ఉర్దూ భాషకు సంబంధించి ఎటువంటి అర్హత లేనివారు థీసిస్ సబ్మిషన్ నాటికి వర్సిటీ అందించే రెండు క్రెడిట్ల ఉర్దూ కోర్సు పూర్తిచేయాల్సి ఉంటుంది.

- విభాగాన్ని అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌తో మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 55 శాతం మార్కులు తప్పనిసరి. వర్సిటీ నిర్వహించే రీసెర్చ్ అడ్మిషన్ టెస్ట్‌లో అర్హత పొంది ఉండాలి. యూజీసీ/సీఎస్ఐఆర్/ ఇన్‌స్పయిర్/ఐకార్/ఐసీహెచ్‌ఆర్/ఐసీఎంఆర్/డీబీటీ/డీఎస్‌టీ ఫెలోషిప్ లేదా రాజీవ్ గాంధీ ఫెలోషిప్ అవార్డ్/టీచర్ ఫెలోషిప్ పొందినవారు; నెట్/సెట్/స్లెట్/జీప్యాట్/గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్నవారు; ఎంఫిల్ అభ్యర్థులు ఆర్ఏటీ రాయనవసరం లేదు. దరఖాస్తు నాటికి సంబంధిత రంగంలో మూడేళ్ల అనుభవం ఉండాలి. అభ్యర్థులు పనిచేస్తున్న సంస్థ నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ సబ్మిట్ చేయాలి. వయోపరిమితి నిబంధనలు లేవు.

వెయిటేజీ: యూజీసీ/సీఎస్ఐఆర్ జేఆర్ఎఫ్ అర్హత ఉన్నవారికి, స్పాన్సర్డ్ అభ్యర్థులకు, రీసెర్చ్ సంస్థల్లో సైంటిస్టులకు 70 మార్కులు; నెట్/సెట్/స్లెట్/గేట్/ జీప్యాట్ అర్హత ఉన్నవారికి, ఇన్‌స్పయిర్/రాజీవ్ గాంధీ తదితర ఫెలోషిప్‌లు ఉన్నవారికి 60 మార్కులు; ఎంఫిల్ అభ్యర్థులకు 50 మార్కుల వెయిటేజీ ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.1500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 18
- **అడ్మిట్ కార్డుల డౌన్‌లోడింగ్:** ఫిబ్రవరి 28 నుంచి
- **రీసెర్చ్ అడ్మిషన్ టెస్ట్ తేదీ:** మార్చి 8
- **ఫైనల్ కీ విడుదల:** మార్చి 12
- **ఫలితాలు విడుదల:** మార్చి 15
- **సర్టిఫికెట్ వెరిఫికేషన్:** మార్చి 18, 19
- **ఇంటర్వ్యూకి ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** మార్చి 22
- **ఇంటర్వ్యూలు:** మార్చి 27, 28
- **అడ్మిషన్స్:** ఏప్రిల్ 3, 4
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** ఏప్రిల్ 15 నుంచి
- **వెబ్‌సైట్:** manuu.edu.in

ఐఐపీఈలో షార్ట్ కోర్సు

విశాఖపట్నంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం ఎనర్జీ(ఐఐపీఈ)కి చెందిన హ్యూమానిటీస్ అండ్ సైన్సెస్(హెచ్&ఎస్) విభాగం- 'అప్లికేషన్స్ ఆఫ్ స్కాలర్ హైపర్‌బోలిక్ కన్జర్వేషన్ లాస్' అంశానికి సంబంధించి షార్ట్ కోర్సును అందిస్తోంది. దీనిని ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. కోర్సు వ్యవధి అయిదు రోజులు. డిగ్రీ/పీజీ చేస్తున్న అభ్యర్థులు, రీసెర్చ్ స్కాలర్స్, పోస్ట్ డాక్టోరల్ ఫెలోస్, మేథమెటిక్స్/సంబంధిత విభాగాలకు చెందిన ఫ్యాకల్టీ మెంబర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఇందులో పార్టిసిపేట్ చేసినవారందరికి ఈ-సర్టిఫికెట్లు ఇస్తారు.

- **కోర్సు తేదీలు:** మార్చి 1 నుంచి 5 వరకు
- **రిజిస్ట్రేషన్ ఫీజు:** డిగ్రీ/పీజీ విద్యార్థులకు రూ.354; రీసెర్చ్ స్కాలర్స్‌కు రూ.590; పోస్ట్ డాక్టోరల్ ఫెలో/ఫ్యాకల్టీ మెంబర్లకు రూ.1180
- **రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** ఫిబ్రవరి 28
- **వెబ్‌సైట్:** www.iipe.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/TfRqOkFలో చదవండి.

నాగార్జున వర్సిటీలో డిస్టెన్స్ ప్రోగ్రామ్‌లు

గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ(ఏఎన్‌యూ) నిర్వహిస్తున్న సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్(సీడీఈ)- దూరవిద్య కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

డిగ్రీ కోర్సులు: ఒక్కో కోర్సు వ్యవధి మూడేళ్లు. ఏడాదికి రెండు చొప్పున ఆరు సెమిస్టర్లు ఉంటాయి. బీఏని తెలుగు మాధ్యమంలో; బీకాం(కంప్యూటర్ అప్లికేషన్స్), బీబీఏ ప్రోగ్రామ్‌లను ఆంగ్ల మాధ్యమంలో; బీకాం(జనరల్) కోర్సుని రెండు మాధ్యమాల్లో చదువుకోవచ్చు.

- బీఏ సబ్జెక్టులు ఎకనామిక్స్, హిస్టరీ, పాలిటిక్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, హిస్టరీ, స్పెషల్ ఇంగ్లీష్, స్పెషల్ తెలుగు, బ్యాంకింగ్, కంప్యూటర్ అప్లికేషన్స్.

పీజీ కోర్సులు: ఒక్కో కోర్సు వ్యవధి రెండేళ్లు. ఏడాదికి రెండు చొప్పున నాలుగు సెమిస్టర్లు ఉంటాయి.

ఎంఏ స్పెషలైజేషన్‌లు: ఇంగ్లీష్, తెలుగు, సంస్కృతం, హిందీ, ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, సోషియాలజీ, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, హ్యూమన్ రిసోర్సెస్ మేనేజ్‌మెంట్

ఎంకాం స్పెషలైజేషన్‌లు: అకౌంటెన్సీ, బ్యాంకింగ్

లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ కోర్సులు: బ్యాచిలర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది.

డిప్లొమా: కోర్సు వ్యవధి ఏడాది. ఆంగ్ల మాధ్యమంలో అందుబాటులో ఉంది. పదోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు అర్హులు.

- స్పెషలైజేషన్‌లు: ఫుడ్ ప్రొడక్షన్, సైకలాజికల్ గైడెన్స్ అండ్ కౌన్సెలింగ్

సర్టిఫికెట్ కోర్సులు: ఒక్కో కోర్సు వ్యవధి ఏడాది. వీటిని ఆంగ్ల మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది.

- సర్టిఫికెట్ కోర్స్ ఇన్ హోటల్ అండ్ హాస్పిటల్ హౌస్ కీపింగ్
- సర్టిఫికెట్ కోర్స్ ఇన్ హెచ్ఐవీ ఎయిడ్స్ కౌన్సెలింగ్.


ముఖ్య సమాచారం

- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 29
- **వెబ్‌సైట్:** www.anucde.info



పద్మవిభూషణ్ పురస్కారానికి ఎంపికైన సందర్భంగా చిరంజీవిని తెలంగాణ గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ సత్కరించారు. చిరంజీవి, సురేఖ దంపతులు శుక్రవారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. చిరంజీవికి ప్రతిష్ఠాత్మకమైన పద్మవిభూషణ్ పురస్కారం ప్రకటించడం పట్ల సౌందరరాజన్ హర్షం వ్యక్తం చేశారు. కోట్లాది ప్రేక్షక హృదయాలను గెలుచుకున్నారని ఆమె చిరంజీవిని అభినందించారు.

కాంబినేషన్ కుదిరింది





విభిన్న కథలు, సరికొత్త గెటప్పులతో ప్రేక్షకులను మెప్పించడం తమిళ హీరో విక్రమ్ పంథా. ఆయన కథానాయకుడిగా ఎస్ యూ అరుణ్ కుమార్ దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. 'చియాన్ 62' వర్కింగ్ టైటిల్. ఇందులో విక్రమ్ ఎలాంటి పాత్ర చేయబోతున్నారనేది ప్రస్తుతానికి సస్పెన్స్. తాజాగా చిత్రబృందం స్పెషల్ అప్‌డేట్‌ను వదిలింది. మాస్ యాక్షన్ ఎంటర్టైనర్‌గా తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో మరో స్టార్ యాక్టర్ ఎస్ జే సూర్య భాగమవుతున్నారు. ఈ విషయాన్ని చిత్రబృందం శుక్రవారం ప్రకటించింది. ఈ చిత్రంలో సూర్య మునుపెన్నడూ చూడని సరికొత్త పాత్రలో కనిపిస్తారని యూనిట్ తెలిపింది. రియా శిబు నిర్మిస్తున్న ఈ చిత్రానికి జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు.

ఏదో ఏదో మాయ

గోపీచంద్ కథానాయకుడిగా నటిస్తున్న యాక్షన్ ఎంటర్టైనర్ 'భీమా'. ఈ చిత్రంలో ఆయన పవర్‌ఫుల్ పోలీసాఫీసర్‌గా కనిపించనున్నారు. ప్రియా భవానీ శంకర్, మాళవిక శర్మ కథానాయికలు. ఏ హర్ష దర్శకత్వంలో కేకే రాధామోహన్ భారీస్థాయిలో నిర్మిస్తున్నారు. మార్చి 8న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. చిత్రబృందం మ్యూజిక్ ప్రమోషన్స్‌ను ప్రారంభించింది. శుక్రవారం 'ఏదో ఏదో మాయ' అంటూ సాగే తొలి గీతాన్ని విడుదల చేసింది. రవి బస్రూర్ స్వరపరిచిన ఈ గీతానికి కల్యాణ్ చక్రవర్తి సాహిత్యం అందించారు. అనురాగ్ కులకర్ణి ఆలపించారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: స్వామి జె గౌడ. ఎడిటర్: తమ్మిరాజు



నేనూ ప్రేమలో పడ్డా



సుబ్బు, శ్రీవల్లి, కిట్టయ్య ప్రధాన పాత్రలు పోషించిన 'ఐ హేట్ లవ్' చిత్రం ఈ నెల 16న విడుదల కానుంది. 'నేనూ ప్రేమలో పడ్డా' అనేది ఉప శీర్షిక. వెంకటేశ్ రవి దర్శకత్వంలో డాక్టర్ బాల రవి ఈ సినిమాను నిర్మించారు. చిత్రం ట్రైలర్‌ను దర్శకుడు వీరశంకర్ ఆవిష్కరించారు. సినిమా కో ప్రొడ్యూసర్ పాలగుమ్మి వెంకట కృష్ణ ఈ సందర్భంగా మాట్లాడుతూ 'మంచి చిత్రాలను ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తారు. అలాగే మా సినిమా కూడా విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది' అన్నారు. దర్శకుడు వెంకటేశ్ మాట్లాడుతూ 'కోనసీమ పరిసర ప్రాంతాల్లో షూటింగ్ చేశాం. యూత్‌ను ఆకట్టుకొనే సందేశాత్మక చిత్రం ఇది' అని చెప్పారు. ఈ చిత్రానికి అంగర శివ సాయి గౌడ ఎగ్జిక్యూటివ్ నిర్మాత.

నవ్య 'స్మార్ట్ పేజీ'లో ఆసక్తికర కథనాల కోసం...ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/eXnCM8Wలో చదవండి.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/0UvYLxHలో చదవండి.

ఘనంగా పీఆర్టీయూ-టీఎస్ ఆవిర్భావ వేడుకలు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి9 : విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే 'ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్-తెలంగాణ స్టేట్ (పీఆర్టీయూ-టీఎస్)'లక్ష్యంగా ముందుకు సాగుతోందని సంఘం జిల్లా అధ్యక్షుడు సంకా బద్రినారాయణ అన్నారు. మహబూబాబాద్‌లోని కంకరబోడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎదుట శుక్రవారం సంఘం ఆవిర్భావ నాయకులు దివంగత శ్యామల యాదగిరి చిత్రపటానికి పూలమాల వేసి, నివాళ్లర్పించారు. అనంతరం ఆయన సంఘం జెండాను ఆవిష్కరించి, మాట్లాడారు. సంఘం స్థాపించబడిన నాటి నుంచి విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయటంతో పాటు ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. పంచాయితీ రాజ్ ఉపాధ్యాయుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన సంఘం తమదే నన్నారు. ప్రాథమిక సభ్యుల ఐక్యత, సమిష్టి కృషితోనే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు.. జిల్లా ప్రధానకార్యదర్శి మిర్యాల సతీష్‌రెడ్డి, కళ్లెం వెంకట్ రెడ్డి, భూక్య రామోజీనాయక్, కోట్యానాయక్, మురళీధర


కంకరబోడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పీఆర్టీయూ-టీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలో పాల్గొన్న నాయకులు

స్వామి, హాల్యానాయక్, ఉమాదేవి, గీత, కనకయ్య శ్యామలాదేవి, మహమూద్ అలీ, ప్రవీన్, వెంకన్న, గాయత్రి, శంకర్, అశోక్, రాములు, చిట్టిబాబు, శ్రీధర్, శ్రీదేవి, సత్యశంకర్, శ్రీనివాస్, నాగేందర్‌రావు, సతీష్, సుజాత, సత్యనారాయణరెడ్డి, శ్రీధర్, సతీష్‌రెడ్డి, సునిత, కవిత, మంగిలాల్ పాల్గొన్నారు.

వివిధ మండలాల్లో..

డోర్నకల్ పీఆర్టీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సంఘం జెండాను మండల అధ్యక్షుడు వెంపటి సీతారాములు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బాధ్యులు చాగర్లముడి శ్రీధర్, కుసుమ నాగేశ్వర్ రావు, కృష్ణారెడ్డి, ప్రభుదాస్, రమేష్, వినోద్, లక్ష్మా, రుక్మాంగదరావు, కమలాదేవి, నవీన్, భాస్కర్, అరుణ భాయి, ప్రమోద్, దీపిక, అంజుమ్‌సుల్తాన, శ్రీనివాస్, రమేష్, బద్రినాథ్, అప్పిరెడ్డి, కృపాకాంత పాల్గొన్నారు.

గూడూరు వేడుకల్లో మండల అధక్షుడు ఈక లక్ష్మయ్య సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం లో మండల విద్యాశాఖ నోడల్ అధికారి చీర బిక్షపతి, మండల వెంకటేశ్వర్లు, చింత బాలయ్య, రవికుమార్, మంగీలాల్, సునిత, రాముడు, అనిల్, కృష్ణమూర్తి,గోపినాథ్, స్వామి, సంపత్ పాల్గొన్నారు. కురవి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సంఘం జెండాను మండల అధ్యక్షుడు భాస్కర్ ఆవిష్కరించారు. అనంతరం విశ్రాంత ఉపాధ్యాయుడు రూపురెడ్డి వెంకట్‌రెడ్డిని సన్మానించారు. నిమ్మ వెంకటేశ్వర్లు, మధుసూధన్‌రెడ్డి, శ్యామలదేవి, నిరంజన్‌రెడ్డి, వెంకటేశ్, మాధవాచారి, శివప్రసాద్, విజయ్, వాహీద్, ఉప్పలయ్య, లక్ష్మీదుర్గ, సాహెన్‌సుల్తానా, జ్యోతి, చంద్రశేఖర్, రాజేందర్, సాంబశివ, మల్లిఖార్జున్ పాల్గొన్నారు. మరిపెడలో నిర్వహించిన వేడుకల్లో కీసర రమేష్ రెడ్డి, లింగాల మహేష్, వెంకన్న, లింగన్న పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో సాధారణ కాన్పుల సంఖ్యను పెంచాలి

● కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, ఫిబ్రవరి9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ కాన్పుల సంఖ్యను పెంచాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ డాక్టర్లకు సూచించారు. మహబూబాబాద్ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యసిబ్బంది పనితీరు, ఆస్పత్రి నిర్వహణను పరిశీలించారు. విధుల్లో ఉన్న వైద్యులు లకావత్‌వెంకట్, బి.వెంకట్రాములు ఆస్పత్రి నిర్వహణ కోసం చేపడుతున్న పనులను కలెక్టరుకు వివరించారు. ముందుగా ఓపీ రికార్డు నమోదును పరిశీలించిన పిదప ప్రసూతి, పిల్లల వార్డులను సందర్శించారు. రేడియాలజీ, తెలంగాణ డయాగ్నస్టిక్ హబ్ ద్వారా అందుతున్న సేవలను వైద్యులు కలెక్టరు కు వివరించారు. సాంకేతిక సిబ్బంది కొరత ఉన్నట్లు వైద్యులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా ఆస్పత్రి పనితీరును మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకోవాలని అందుకు తనవంతు సహకారం ఉంటుందని కలెక్టర్ చెప్పారు.

తొర్రూరు సీఐగా ఫణిధర్



తొర్రూరు, ఫిబ్రవరి 9 : తొర్రూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా కె.ఫణిధర్ రానున్నారు. ప్రభుత్వం సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ పనిచేస్తున్న సీఐ సత్యనారాయణను మహబూబాబాద్ డీఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేయగా జిల్లాలోని గూడూరు సీఐగా విధులు నిర్వహిస్తున్న ఫణిధర్ తొర్రూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా రానున్నారు. ఆదివారం బాధ్యతలు స్వీకరిస్తారని పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు.

గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి


ఉమేష్ (ఫైల్)

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 9 : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్సపొందుతూ శుక్రవారం వరంగల్‌ఎంజీఎంలో మృతి చెందారు. మహబూబాబాద్ రూరల్ ఏఎస్సై సూరయ్య తెలిపిన వివరాల ప్రకారం.. కేసముద్రం మండలం కల్వల గ్రామానికి చెందిన ముప్ప ఉమేష్ (34) ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈనెల 5న సొంత పనుల నిమిత్తం కల్వల నుంచి ద్విచక్రవాహనంపై మహబూబాబాద్‌కు వచ్చి పనులు ముగించుకుని రాత్రి స్వగ్రామానికి వెళ్తున్నాడు. సరిగ్గా జిల్లా కేంద్రం శివారు తాళ్లపూసపల్లిరోడ్డు మామిడితోట సమీపంలోకి రాగానే కల్వలకు వెళ్తున్న ఉమేష్ ముందు వెళ్తున్న ఓవర్‌టెక్ చేస్తూ కేసముద్రం నుం చి మహబూబాబాద్‌కు వస్తున్న గుర్తు తెలియని ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఉమేష్ తలకు తీవ్ర గాయాలు కాగా, అతన్ని స్థానికులు 108 ద్వారా జిల్లా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించగా శుక్రవారం తెల్లవారుజామున చికిత్స పొందుతూ.. ఉమేష్ మృతి చెందాడు. మృతునికి భార్య అనూష, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడు ఉమేష్ తండ్రి వీరయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై సూరయ్య తెలిపారు.

దాడికేసులో ఇద్దరికి జైలు శిక్ష

మరిపెడ, ఫిబ్రవరి 9: దాడిచేసి గాయపర్చిన కేసులో ఎల్లంపేట రెవెన్యూ పరిధి సోమ్లాతండాకు చెందిన ఇద్దరు వ్యక్తులకు ఏడాది జైలు శిక్ష, జరిమాన విధిస్తూ తొర్రూరు కోర్టు జడ్జీ మట్ట సరిత శుక్రవారం తీర్పు చెప్పారు. మరిపెడ ఎస్సై ఎస్కే.తహెర్ తెలిపిన వివరాల ప్రకారం 2014 సంవత్సరంలో సోమ్లాతండాకు చెందిన అజ్మీరా మంగ్యా, సుజాతలు తండాలోని రహదారిపై ముళ్ల కంచె వేశారు. ప్రశించినందుకు అజ్మీరా బాలాజీపై చేయిచేసుకొని గాయపర్చారు. ఆయన అప్పట్లో మరిపెడ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై ఎన్.నాగభూషణం కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ వేశారు. ఈ కేసును పబ్లిక్ ప్రాసిక్యూటర్ గణేశ్ ఆనంద్ వాదించగా పూర్వపరాలు పరిశీలించిన జడ్జీ అజ్మీరా మంగ్యా, సుజాతలకు జైలు శిక్ష, జరిమానా విధించారు. సాక్షులను కోర్టు ప్రవేశపెట్టిన కోర్టు కానిస్టేబుల్ రాంనారాయణను తొర్రూరు డీఎస్పీ వెంకటేశ్వరబాబు, సీఐ రాజు, ఎస్సై తహెర్ అభినందించారు.

అసంక్రమిత వ్యాధుల 'ఆన్‌లైన్' నమోదు తప్పనిసరి

●ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి నాగేశ్వర్‌రావు

నెహ్రూసెంటర్, ఫిబ్రవరి 9 : అసంక్రమిత వ్యాధుల 'ఆన్‌లైన్' నమోదు తప్పనిసరిగా చేపట్టాలని ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి నాగేశ్వర్‌రావు సూచించారు. మానుకోటలోని ఐడీవోసీలోని జిల్లా ఆరోగ్యశాఖ కార్యాలయంలో శుక్రవారం అసంక్రమిత వ్యాధులపై ఆన్‌లైన్ నమోదుపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 ఏళ్ల పైబడిన వారందరికి బీపీ, షుగర్, హైపర్‌టెన్షన్ వ్యాధులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, జిల్లాలో ఉన్న ఏఎన్‌ఎం, ఎంహెచ్‌పీలకు వీటిపై సరైన అవగాహన ఉండి ప్రజలను రోగల బారిన పడకుండా చైతన్యం చేయాలన్నారు. విజయ్‌కుమార్, శ్రావణ్‌కుమార్, కె.ప్రసాద్, కృష్ణార్జున్‌రావు, వడ్డెబోయిన శ్రీనివాస్, కెవి.రాజు, పురుషోత్తం, డీపీవో రుక్మోద్దీన్, రమేష్, గీత పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలు మృతి


అది మల్లమ్మ (ఫైల్)

గూడూరు, ఫిబ్రవరి 9 : మండల కేంద్రానికి చెందిన శతాధిక వృద్ధురాలు అది మల్లమ్మ(102) మృతి చెందారు. గత మూడ్రోజులుగా మల్లమ్మ స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. శుక్రవారం సాయంత్రం ఆమె స్వగృహంలో తుది శ్వాస విడిచారు. మల్లమ్మ1921లో జన్మించించారు. ఆమెకు ఇద్దరు కుమారులు, అది వీరసోములు, దివంగత అది సత్యనారాయణతో పాటు నలుగురు కుమార్తెలు మాదాసు సోమక్క, గాజుల ధనమ్మ, మాదాసు భాగ్యమ్మ, బండి అనూరాధ ఉన్నారు. వారితోపాటు వందమందికి పైగా మనవళ్లు, మనవరాళ్లు, మునిమనవరాళ్లు, మనవళ్లు ఉన్నారు. దేశంలో ప్రారంభమైన మొదటి ఎన్నికల నుంచి మల్లమ్మ ఓటుహక్కును క్రమం తప్పకుండా వినియోగించకున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. కాగా, శనివారం మల్లమ్మ అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

సర్పంచ్‌గా శైలజ సేవలు అభినందనీయం


వేం శైలజామోహన్‌రెడ్డిలను సన్మానిస్తున్న గ్రామస్తులు

గూడూరు, ఫిబ్రవరి 9 : తీగలవేణిలో సర్పంచ్‌గా వేం శైలజామోహన్ చేసిన అభివృద్ధి పనులు అభినందనీయమని బీఆర్ఎస్ మండల అధ్యక్షులు వేం వెంకటకృష్ణారెడ్డి అన్నారు. ఇటీవల గ్రామపంచాయతీ పాలకవర్గం పదవీ కాలం ముగియడంతో గ్రామాన్ని అభివృద్ధి పథంలో నిలిపిన సర్పంచ్ శైలజా మోహన్‌రెడ్డితో పాటు వార్డుసభ్యులను శుక్రవారం శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వెంకటకృష్ణారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల సాధనే పీఆర్‌టీయూ లక్ష్యం

కేసముద్రం, ఫిబ్రవరి 9 : రాష్ట్రంలో అతిపెద్ద ఉపాధ్యాయ సంఘం పీఆర్‌టీయూ అని, ఉపాధ్యాయ సమస్యల సాధనే లక్ష్యమని ఆ సంఘం మండల అధ్యక్షుడు బీరం జనార్దన్‌రెడ్డి అన్నారు. కేసముద్రం ఎంఆర్‌సీ ఆవరణలో శుక్రవారం ఆ సంఘం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సంఘ పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం త్వరలో పదవీవిరమణ పొందే మండల నోడల్ అధికారి కొత్త జగన్మోహన్‌రెడ్డి, హెచ్‌ఎం విజయసుశీల, ఉపాధ్యాయులు రాయిలి కోటేశ్వర్లు, శ్రీహరి, మల్లయ్య, ఓదెలు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు కొడిపాక రమేష్‌ను సన్మానించారు. కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి గోపాల శ్రీధర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రాపోలు యాకయ్య, ఉపాధ్యక్షుడు బండారు నరేందర్, కార్యదర్శి కక్కెర్ల రవీందర్, హరినాథ్, ఉమేశ్వర్, వీరభద్రం పాల్గొన్నారు.

గ్యాస్ సర్వేను పరిశీలించిన అధికారులు


రూ.500 గ్యాస్ పథకం సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంపీడీవో

కేసముద్రం, ఫిబ్రవరి 9 : కేసముద్రం స్టేషన్ గ్రామపంచాయతీ పరిధిలో మహాలక్ష్మీ కింద రూ.500 గ్యాస్ పథకంలో ఇంటింటి సర్వేను శుక్రవారం తహసీల్దార్ తాళ్లూరి దామోదర్, ఎంపీడీవో రవీందర్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరు గ్యారెంటీల దరఖాస్తుల్లో గ్యాస్ విని యోగదారుల సంఖ్యను సక్రమంగా ఇవ్వని వారినుంచి వివరాలను సేకరించి నమోదు చేయిస్తు న్నట్లు తెలిపారు. ఇలా కేసముద్రం స్టేషన్ జీపీ పరిధిలో 847 మంది ఉన్నా రని చెప్పారు. కార్యక్రమంలో కార్యదర్శి అశోక్‌కుమార్, అంగన్‌వాడీ టీచర్లు లలిత, రాజమణి పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఎస్‌జీఎఫ్ సహాయం

కేసముద్రం, ఫిబ్రవరి 9 : మండలంలోని కోరుకొండపల్లిలో ఇటీవలె వివిధ కారణాలతో మృతి చెందిన కడారి కొమురయ్య, బీర్రు వెం కటనర్సమ్మ కుటుంబాలకు 50కిలోల చొప్పున బియ్యం, నెలకు సరిపడే సరుకులను సమ్మిగౌడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు చిలువేరు సమ్మయ్యగౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం అందజేశారు. ఆయా కుటుంబాలను ఆయన పరామర్శించి, సంతాపం వ్యక్తం చేశారు. దామరకొండ ప్రవీణ్, ఎర్రంశెట్టి అశోక్, సామల నర్సయ్య, మూల భూలోకరెడ్డి, సట్ల శ్రీను, యాసాడి బాలాజీరెడ్డి, నాగెల్లి శ్రీనివాస్, బీరం గోపాల్‌రెడ్డి, జయపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికలు

● మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి


అధికారులతో సమీక్షిస్తున్న రాంమోహన్‌రెడ్డి

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 9 : వచ్చే వేసవికాలంలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్ మునిసిపల్ కార్యాలయంలో శుక్రవారం తాగునీటి సరఫరా, వేసవి కార్యాచరణ ప్రణాళికపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలు వేసవిలో తాగునీటి కోసం ఎలాంటి ఇబ్బందులు పడవద్దని, అందుకోసం ప్రణాళికలు రచించి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో కమిషనర్ ప్రసన్నారాణి, డీఈ ఉపేందర్, ఏఈ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రికార్డులను పారదర్శకంగా నిర్వహించాలి

● అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో

నెల్లికుదురు, ఫిబ్రవరి 9 : గ్రామ పంచాయతీల రికార్డులు పారదర్శకంగా ఉండాలని, నిర్వహణ తీరును మెరుగు పరుచుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్‌టొప్పో తెలిపారు. గ్రామాలలో మౌళిక వసతుల కల్పనలో భాగంగా చేపట్టిన స్పెషల్‌డ్రైవ్‌లో శుక్రవారం వాలివాలను సందర్శించారు. గ్రామపంచాయతీ కార్యాలయం, అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాలలోని మరుగుదొడు, మధ్యాహ్నభోజన పథకం నిర్వహణ తీరును పరిశీలించారు. నర్సరీల నిర్వహణ పెంచాలన్నారు. శ్మశానవాటికలో సౌకర్యాలు మెరుగు పరుచాలన్నారు. డంపింగ్‌యార్డు నిర్వహణ సక్రమంగా జరుగాలన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని దగ్గించుకోవడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీవో శేషాద్రి, కార్యదర్శి నాగజ్యోతి పాల్గొన్నారు.

విద్యార్థులకు సులభపద్ధతిలో బోధించాలి

తొర్రూరు రూరల్, ఫిబ్రవరి9 : ప్రతీ విద్యార్థికి అర్థమయ్యే విధంగా సులభ పద్ధతిలో విద్యాబోధన చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు అన్నారు. అమ్మాపురం ప్రాథమిక పాఠశాలకు కాటన్‌కనెక్ట్ వారు, మైరాల్డ్ సంస్థ సహకారంతో రూ.6లక్షల విలువ చేసే ఎల్‌ఈడీ ప్యానల్స్ అందజేశారు. కాటన్ కనెక్ట్ సంస్థ రాష్ట్ర ఇన్‌చార్జి చింతయ్య, మైరాడ సంస్థ జిల్లా ఇన్‌చార్జి శ్రీనివాస్,ఎంఎన్‌వో మహంకాళి బుచ్చయ్య, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనుబాబు, హెచ్‌ఎం తుమ్మ వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ ముద్దం విక్రమ్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పీవీకి భారతరత్న రావడం హర్షనీయం

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 9 : దివంగత మాజీ ప్రధాని పీవీ.నర్సింహారావుకు కేంద్రప్రభుత్వం భారత్‌రత్న ప్రకటించడం అభినందనీయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యాప సీతయ్య అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని శ్రీనివాస థియేటర్ సెంటర్‌లో శుక్రవారం పీవీ.నర్సింహారావు ఫ్లెక్సీ వద్ద స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మోసంగి మురళి, వలపదాసు భద్రయ్య, దార ఇందుభారతి, మారగాని రాజు, రమేష్ నాయక్, దిడ్డి మహేష్, నరేష్, నాగరాజు, రాము, చుక్కల నరేష్, మల్లం యశ్వంత్, మునీందర్, నాగరాజు పాల్గొన్నారు.

'భారత్ బంద్‌ను సక్సెస్ చేయాలి'

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 9 : దేశవ్యాప్తంగా నిర్వహించే గ్రామీణ భారత్‌బంద్‌ను జయప్రదం చేయాలని భారత కార్మిక సంఘాల సమైక్య (ఇఫ్టూ) జిల్లా అధ్యక్షుడు పర్వత కోటేష్ పిలుపునిచ్చారు. మహబూబాబాద్ రాజ్‌దళ్, శ్రీరామ బాలాజీ రైస్‌మిల్లుల యాజమానులకు శుక్రవారం సమ్మె నోటీసును అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్మిక చట్టాలను నాలుగు లేబర్‌కోడ్‌లుగా మార్చారని, దీన్నికార్మికులు వ్యతిరేకించడంతో వాటిని రద్దు చేసినట్లు చెప్పారు. 16న జరిగే సమ్మెను కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సురేష్, లింగన్న, రాజు, శంకర్, రాంబాబు, రాంమ్మూర్తి, ఉప్పలయ్య పాల్గొన్నారు.

భయం వదులుకో.. విజయం అందుకో

(3వ పేజీ తరువాయి)

సమర్థులను కూడా నిర్వీర్యం చేస్తుంది. పాఠ్యాంశం అర్థం చేసుకుని సబ్జెక్ట్ మీద ఇష్టం, ఆసక్తితో చదవడం ద్వారా మరిచిపోవడం జరగదు. ఇష్టమైన సినిమాలో కొన్ని సన్నివేశాలు ఎలా గుర్తు పెట్టుకోగలుగుతున్నామో అదే కోణంలో చదువుపై శ్రద్ధ, ఆసక్తి పెంపొందించుకుంటే విజయం తథ్యం.

టెన్షన్ వదిలి, ప్రోత్సహించాలి..

పరీక్షలు ప్రారంభం అవుతున్నాయంటే పిల్లలతో పాటు పెద్దలకు టెన్షన్ మొదలవుతోంది. ఎలా చదువాలా.. అని పిల్లలు కంగారు పడుతుంటే వారిలో జ్ఞాపకశక్తి పెంచడం, ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఇవ్వడం లాంటి అంశాలపై పెద్దలు ఆందోళనలు చెందుతుంటారు. వీటన్నింటికి ముందుగా పరీక్షల సమయంలో పిల్లలకు ఇంటి వాతావరణం, అమ్మనాన్నల ప్రోత్సాహం అనుకూలంగా ఉండాలని మానసిక వైద్యనిపుణులు సూచిస్తున్నారు. పెద్దవాళ్లు తమ ఇష్టాలను పిల్లలపై రుద్దడం, అసలు చేయకూడదు. వీలైనంత వరకు పిల్లల ఆలోచన సరళికి అనుగుణంగా సపోర్టుగా ఉండాలి. అవసరమైనప్పుడు వారిలో ఒత్తిడి భయాందోళనను తొలగించే రూపంలో కబుర్లు చెప్పాలి. చదువుకునే ప్రక్రియలో పిల్లలు అనుకూల వాతావరణంలో సంతోష పడేలా చూడాలి.

జ్ఞాపకశక్తి పెంచే ఆరోగ్య ఆహారం..

విద్యార్థి దశలో చదువుకోవడంతో పాటు ఆ చదువుకు సార్థకత చేకూరాలంటే పరీక్షల్లో నెగ్గాలి. ఈ రెండు విద్యలో భాగమని ఎప్పుడైతే విద్యార్థులు గుర్తిస్తారో తప్పకుండా విజయం వైపు పయనిస్తారు. పిల్లలు చురుగ్గా ఆలసట లేకుండా ఉండకలిగితే జ్ఞాపకశక్తి అంతే పాదరసంలా పని చేస్తుంది. చదువు మధ్యలో కాస్త ఉపశమనం కోసం ఆహారం ఇస్తుండాలి. బ్రెయిన్‌ఫుడ్ జ్ఞాపకశక్తిని పెంచుతోంది. మెదడు చురుకుగా పని చేయాడానికి ఆరోగ్యవంతమైన ఫ్యాట్స్ తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. అన్ని రకాల గింజలు, నట్స్ తినడం వల్ల జ్ఞాపకశక్తి పెరుగుతోంది. బాదం, పిస్తా, జీడిపప్పుల్లో అత్యంత నాణ్యమైన కావల్సినంతా అయిల్స్, ఫాట్స్ ఉంటాయి. అందుకే నట్స్ గుమ్మడి గింజలు, నువ్వులు, పొద్దుతిరుగుడు గింజలు తింటుండాలని సూచిస్తున్నారు. తాజా ఆకుకూరలు విభిన్న రకాల కూరగాయాలు, పండ్లతినడం వల్ల యాంటి ఆక్సిడెంట్స్ ఎక్కువగా లభిస్తాయని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు వార్షిక పరీక్షలు బాగా రాయగలరు.

తెలంగాణ ఖ్యాతిని ప్రపంచానికి చాటిన మహనీయుడు పీవీ..

● మాజీ మంత్రి సత్యవతిరాథోడ్

మహబూబాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఖ్యాతిని ప్రపంచానికి చాటిన మహనీయుడు మాజీ ప్రధాని, దివంగత పీవీ. నర్సింహారావు అని రాష్ట్ర మాజీమంత్రి, ఎమ్మెల్సీ సత్యవతరాథోడ్ శుక్రవారం ఒక ప్రకటనలో కొనియాడారు. బహుముఖ ప్రజ్ఞాశాలి, బహు భాషాకోవిధుడు నర్సింహారావుకు భారతరత్న ప్రకటించడం యావత్ రాష్ట్రం గర్వించదగ్గ విషయమన్నారు. దేశ ప్రధానిగా పని చేసిన నర్సింహారావు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన వారు కావడం గర్వకారణమన్నారు. స్వరాష్ట్రంలో బీఆర్ఎస్ హయంలో పీవీ జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహించడంతో పాటు భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు గుర్తు చేశారు. పీవీ నర్సింహారావు అందరికి ఆదర్శనీయమని సత్యవతి చెప్పారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 9 : ఖమ్మంలో ఈనెల 11. 12 తేదీల్లో నిర్వహించనున్న తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) రాష్ట్ర ద్వితీయ విద్యావైజ్ఞానిక మహాసభలను జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర కార్యదర్శి కవిత పిలుపునిచ్చారు. మహబూబాబాద్‌లో శనివారం సాయంత్రం రాష్ట్ర మహాసభల విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు చుంచు శ్రీశైలం నేతృత్వంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. బలాష్టి రమేష్, సువర్ణ, ఉప్పలయ్య, ఉపేందర్, విద్యాసాగర్, విజయ్‌కుమార్, మీరా, ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్, విజయ్‌రాజ్, రాజు, గోవర్ధన్, యాకయ్య, మధు, అనిత, వనజ, కవిత, మంజుభార్గవి, హరిణి, జయశ్రీ, హిమబిందు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ ఏలో చేర్చాలి

● ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొడుగు శ్రీనివాస్

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 9 : ఆర్థికంగా వెనుబాటుకు గురవుతున్న ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొడుగు శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు హైదరాబాద్‌లో బీసీ సంక్షేమ శాఖమంత్రి పొన్నం ప్రభాకర్‌కు శుక్రవారం వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదిరాజ్‌లు బీసీ-ఏలో లేకపోవడం వల్ల విద్యా, ఉద్యోగ రంగాల్లో తీవ్రనష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న సమయంలో జీవోఎంఎస్ నెంబరు-15 ద్వారా ముదిరాజ్‌లను బీసీ-ఏలోకి మార్చడం జరిగిందని అది మూన్నాళ్లముచ్చటగా మారిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నేతలు బల్ల సత్తయ్య, కనకయ్య, భీమ్‌లక్ష్మణ్ పాల్గొన్నారు.

12న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి పర్యటన

డోర్నకల్, ఫిబ్రవరి 9 : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డోర్నకల్ మండలంలో పర్యటించనున్నట్లు టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ శుక్రవారం తెలిపారు. డోర్నకల్‌లో ఆయన మాట్లాడుతూ ఈనెల 12న ఎమ్మెల్సీ పర్యటనలో భాగంగా వివిధ పాఠశాలలను సందర్శించనున్నట్లు చెప్పారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్సీకి ఉపాధ్యాయులు వినతిపత్రాలను అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శివప్రసాద్, కాసుమారెడ్డి, ప్రతాపని సత్యనారాయణ, గంగావత్ కృష్ణ, బుచ్చయ్య, రాములు, సీతారాములు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించాలని

గార్ల, ఫిబ్రవరి 9 : బంజారాల ఆరాధ్యదైవంగా భావించే శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని గిరిజన ఉద్యోగ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి గంగావత్ శ్రీనువాస్ నాయక్ కోరారు. శుక్రవారం సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరుతూ తహసీల్దార్ కె.స్వాతిబిందుకు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం సమర్పించిన వారిలో శివనాయక్, వీరన్ననాయక్, భోజ్యానాయక్ పాల్గొన్నారు.

'ప్రతీ విద్యార్థి పేరును యూ-డైస్ ప్లస్‌లో నమోదు చేయాలి'

కురవి, ఫిబ్రవరి 9 : పాఠశాలలో ప్రవేశం పొందిన ప్రతీ విద్యార్థి పేరు యూ-డైస్ ప్లస్‌లో నమోదు చేయాలని జిల్లా విద్యాశాఖ కో-ఆర్డినేటర్లు సంతోష్, పూర్ణచందర్ అన్నారు. కురవిలోని నాగార్జున హైస్కూల్‌ను శుక్రవారం సందర్శించి విద్యార్థుల అటెండెన్స్ రిజిష్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూ-డైస్‌లో ఉన్న విద్యార్థుల సంఖ్య పాఠశాల అటెండెన్స్ రిజిష్టర్‌లో ఉన్న సంఖ్య సమానంగా ఉండాలని సూచించారు. ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ వి. ప్రభాకర్, సీఆర్పీ బి.వెంకన్న పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో

విద్యాభివృద్ధికి చర్యలు చేపట్టాలి


మంత్రి సీతక్కకు వినతి పత్రం ఇస్తున్న ప్రధానోపాధ్యాయులు

కొత్తగూడ, ఫిబ్రవరి 9 : రాష్ట్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యాభివృద్ధికి చర్యలు పెట్టాలని గిరిజన సంక్షేమ ప్రధానోపాధ్యాయుల సంఘం నాయకులు పంచాయితీ రాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖమంత్రి దనసరి సీతక్కను కోరారు. హైదరాబాద్‌లో సీతక్కకు వినతి పత్రం అందజేశారు.గిరిజన సంక్షేమ ప్రధానోపాధ్యాయుల సంఘం డైరీని మంత్రి సీతక్క ఆవిష్కరించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాములు, జనరల్ సెక్రెటరీ చందన్, ప్రధానోపాధ్యాయులు పుల్లం శ్రీనివాస్, కల్తీ శ్రీను, గాంగునాయక్, కల్తీ శ్రీను పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయాలి

తొర్రూరు, ఫిబ్రవరి 9 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ చేపట్టే 22వ సార్వత్రిక సమ్మె, సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో చేపట్టే దేశవ్యాప్త బంద్‌ను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి అన్నారు. శుక్రవారం తొర్రూరులో సమ్మె వాల్‌పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. నాయకులు వెంకన్న, లక్ష్మయ్య, సాయిలు, మధు, యాకయ్య, రమేష్, భిక్షం పాల్గొన్నారు.

'టీచర్ల సమస్యల పరిష్కారానికి కృషి'

పెద్దవంగర, ఫిబ్రవరి 9 : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ నిరంతరం కృషి చేస్తుందని మండల అధ్యక్షుడు గొట్టిముక్కల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఎంఆర్‌సీ కార్యాలయంలో పీఆర్‌టీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పీఆర్టీయూ జెండాను ఆవిష్కరించి రిటైర్డ్ హెచ్‌ఎం వేముల సత్యానారాయణను సన్మానించారు. నాయకులు రమేష్ కుమార్, సోమయ్య, ప్రభాకర్‌రెడ్డి, సురేష్ కుమార్, యాకుబ్, ఆంజయ్య, వెంకన్న, రవి, రాజేష్, హైమా, శ్రీధర్, కరుణ, సువర్ణ, ప్రదీప్ పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీలకు దాట్ల విద్యార్థులు

దంతాలపల్లి, ఫిబ్రవరి 9 : దాట్ల ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు కంచర్ల ప్రభాకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అండర్-12 బాలికల విభాగంలో జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన పోటీల్లో 6వ తరగతికి చెందిన బయ్యఉదయశ్రీ, 7వ తరగతికి చెందిన జరంగి త్రిష షాట్‌పుట్‌లో ద్వితీయ స్థానం కైవసం చేసుకొని రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. వీరు ఈనెల 10, 11న భద్రాద్రి జిల్లా కేంద్రంలో నిర్వహించే అథ్లెటిక్స్‌లో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా వారిని పాఠశాల యాజమాన్యం అభినందించారు. ఉపాధ్యాయులు సంజయ్‌కుమార్, విజయ్‌కుమార్, రమేష్, ప్రేమ్‌కుమార్, రిషిత, మాధవి, ఉదయశ్రీ పాల్గొన్నారు.

'అక్రమ కేసులను ఎత్తివేయాలి'

మరిపెడ, ఫిబ్రవరి 9 : మరిపెడ విలేజీ దళితులపై బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అక్రమ కేసులు పెట్టారని, వాటిని వెంటనే ఎత్తివేయాలని బీఎస్పీ జిల్లా కార్యదర్శి ఐనాల పరుశరాములు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఆ పార్టీ ఆఫీస్‌లో అఖిలపక్ష సమావేశం ఏర్పాటుచేసి, ఆయన మాట్లాడారు. రవి, కందాల రమేశ్, హలవత్ రంజిత్, జినక స్వామి, మధుసూదన్, రంగన్న, జిన్న లచ్చన్న పాల్గొన్నారు.

'సేవా కార్యక్రమాలు అభినందనీయం'

తొర్రూరు, ఫిబ్రవరి 9 : ప్రజలకు ఉపయోగపడే విధంగా సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయం అని మునిసిపల్ కమిషనర్ సరస్వతి అన్నారు. శుక్రవారం తొర్రూరులోని ఆర్యవైశ్య సంఘాలు, వాసవీక్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమావాస్య అన్నదానాన్ని ప్రారంభించారు. ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు ప్రొద్దుటూరి గౌరీశంకర్, గోపారపు రమాఉపేందర్, నిరంజన్, బిజ్జాల అనిల్, సీహెచ్.రాము, బిజ్జాల వెంకటరమణ,ఇమ్మడి రాంబాబు, శ్రీనివాస్, సోమయ్య, మధు, గాయత్రి, శివజ్యోతి, మాధవి, క్లబ్‌సభ్యులు పాల్గొన్నారు.

మహా సభలను జయప్రదం చేయండి

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి9 : ఖమ్మంలో మార్చి 3,4,5 తేదీల్లో నిర్వహించే విప్లవ యూనిట్ మహాసభలను జయప్రదం చేయాలని ప్రజాపంథా జిల్లా కార్యదర్శి చిన్న చంద్రన్న పిలుపునిచ్చారు. మానుకోటలోని ఆ పార్టీ కార్యాలయంలో శుక్రవారం మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. కొత్తపల్లి రవి, సూర్యం, వెంకటేశ్వర్లు, సత్యం పాల్గొన్నారు.